సాక్షి ఖమ్మం

సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



బర్డ్‌ఫ్లూ కలకలం

చింతకాని మండలం ప్రొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో కోళ్లు మృతి చెందుతుండడంతో బర్డ్ ఫ్లూనే కారణమని ఆందోళన చెందుతున్నారు. 8లో



కరకట్టకు 'బ్రిడ్జి' బ్రేక్!

భద్రాచలం కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కరకట్ట పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండగా వర్షాకాలంలో వరద ముప్పు తప్పేలా లేదు. 8లో

గరిష్టం / కనిష్టం

35° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం మొదలైన ఎండ మధ్యాహ్నానికి అధికమవుతుంది. రాత్రి వాతావరణం మాత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

15 అడుగులకు 'పాలేరు'



రిజర్వాయర్‌లో తగ్గిన నీటిమట్టం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 15 అడుగులకు చేరింది. ఇటీవల నీటిమట్టం 20 అడుగుల పైగానే ఉండగా ఆయకట్టు పరిధిలో పంటలకు నీరు విడుదల చేస్తుండడడంతో తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం సాగర్ నుంచి 4,550 క్యూసెక్కుల నీరు చేరుతుండగా 4,334 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే, మిషన్ భగీరథ పథకానికి 135 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యాన నీటిమట్టం తగ్గుతుండడంతో పాలేరు పాత కాల్వ, భక్త రామదాసు ప్రాజెక్టులకు సరఫరా నిలిపేశారు. కాగా.. తాగు, సాగునీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా సాగర్ నుంచి నీటి సరఫరాను పెంచనుండగా పాత కాల్వకు రెండు రోజుల్లో విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు.

ఘనంగా భజన బృందాల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ధర్మ ప్రచారకులు

ఖమ్మంఅర్బన్: విశ్వహిందూ పరిషత్ సనాతన ధర్మం, సత్సంగం, భక్తి మార్గం ప్రచారంలో భాగంగా ఆదివారం నగరంలోని రోటరీనగర్‌లోని శ్రీరాజరాజేశ్వరి ఆలయ మండపంలో భజన బృందాల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని భజన బృందాలందరినీ సమన్వయం చేయాలనే ఉద్దేశంతో ఈ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సనాతన ధర్మం, పూజా విధానం, భజన చేసే విధానాలపై తిరుమల తిరుపతి ధర్మ ప్రచారకులు వనం తేజశ్రీ బోధించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన పండరినాథ్, బోనాల రామకృష్ణ, బొడ్డు కృష్ణ, చలమల వెంకటేశ్వర్లు, వెంకట రాణాప్రతాప్, పసుమర్తి రవి, నేరెళ్ల శ్రీనివాస్, కనగంటి నాగమణి, కట్టా వైదేహి, కృష్ణప్రియ, శ్రీనివాసు, రాణి, రాజు, రవి, రాము, లక్ష్మీనారాయణ, భానుమతి, శశాంక్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

టీజీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మం సహకారనగర్ : నేటి విద్యార్థులే రేపటి సారథులని, విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని సైన్స్ మ్యూజియంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పరీక్ష విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరి మాట్లాడుతూ.. విద్యారంగంలో ట్రస్ట్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత డీఈఓ సోమశేఖర శర్మ ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షత వహించగా టీజీఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, పరీక్షల ఏసీ రమేష్, డీసీఈబీ సెక్రటరి నారాయణ, ఖమ్మం అర్బన్ ఎంఈఓ కె.వి.శైలజాలక్ష్మి, టీఎస్‌జీఓస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, జగదీశ్వర్, శ్యాంసన్, రాయల రవికుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో సండే సందడి

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలో గల కిన్నెరసానిలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 474 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,695 ఆదాయం లభించగా, 200మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.12,490 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



కళకళ..

కొత్తగూడెం బాబుక్యాంపు సెంటర్‌లో మటన్ షాపుల వద్ద కోలాహలం



తళతళ..

ఖమ్మంలో చేపలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



వెలవెల..

వినియోగదారులు లేక వెలవెలబోతున్న రామవరంలోని చికెన్ షాపు

చాలా మంది ఇళ్లలో ఆదివారం వస్తే ముక్క లేనిదే ముద్ద దిగడం కష్టమే. అది చికెన్, మటన్ లేదా చేపలు ఏదో ఒకటి స్తోమత ఆధారంగా ఉండాల్సిందే. ఇటీవల కోళ్లకు వైరస్ సోకుతోందనే ప్రచారం జోరందుకున్న నేపథ్యాన జిల్లాలో ఆ ప్రభావం లేదని అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ జనాన్ని పట్టిన భయం వీడలేదు. ఇంతలోనే ఆదివారం వచ్చింది. అందరికీ అందుబాటు ధరలో ఉండే చికెన్ తెచ్చుకుందామనుకుంటే వైరస్ భయం పట్టి పీడిస్తోంది. ఫలితంగా చేసేదేం లేక కొందరు మటన్, ఇంకొందరు ఉదయం నుంచే చేపల షాపుల వద్ద బారులుదీరారు. అయితే, మాంసాహార ప్రియులు ఎప్పుడూ లేనంతగా వెల్లువెత్తడంతో ఇదే అదనుగా మటన్ ధర రూ.1200కు పెంచగా.. చేపల ధర సైతం కేజీకి రూ.30కి పైగా పెంచినట్లు తెలిసింది. అయినా ముక్క లేనిదే ఆదివారం భోజనం చేయడం కష్టమైన వారంతా తప్పదనుకుని కొనేశారు !

– ఖమ్మంఅర్బన్/చుంచుపల్లి

పైలట్ ప్రాజెక్ట్‌గా 31 గ్రామాలు

ఖమ్మం జిల్లాలో 27, భద్రాద్రి జిల్లాలో నాలుగు గ్రామాలను పూర్తి సోలార్ విలేజ్‌లుగా మార్చేందుకు అధికారులు ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో 22 గ్రామాలు, నేలకొండపల్లి మండలం చెరువుమాధారం, రఘునాథపాలెం మండల కేంద్రం, మధిర మండలం సిరిపురం, ఏన్కూర్ మండలం లచ్చగూడెం, శ్రీరాంగిరి, భద్రాద్రి జిల్లాలో దమ్మపేట మండలం గండుగులపల్లి, దురదపాడు, కె.ఎం.గూడెం, రెడ్డియాలపాడు గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికి 1 కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల వరకు ఉచితంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. రైతుల పొలాల్లో 5 హెచ్‌పీ మోటార్‌కు సోలార్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అధికారులు సర్వే చేస్తున్నారు.



ఇక సౌర వెలుగులు..

- ఉమ్మడి జిల్లాలో 280 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు
- పీఎం కుసుమ్ పథకం కింద దరఖాస్తుల స్వీకరణ
- ఉమ్మడి జిల్లాలో 15 మెగావాట్లకు అందిన తొమ్మిది అప్లికేషన్లు
- మోడల్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో సౌర వెలుగులు నింపేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం–కుసుమ్) పథకం కింద సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం అవుతున్నాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఆసక్తి గల రైతులు, రైతు సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, ఎస్‌హెచ్‌జీల నుంచి తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్‌కో) అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఈ పథకంపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 280 మెగావాట్ల ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా.. ఇందులో 200 మెగావాట్ల ప్లాంట్లను రైతులు, రైతు సంఘాలు, డెవలపర్స్‌తో ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. మరో 80 మెగావాట్ల ప్లాంట్లను స్వయం సహాయక సంఘాలకు కేటాయించనున్నారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద 31 గ్రామాలను సోలార్ మోడల్ విలేజ్‌లుగా ఎంపిక చేశారు. ఇప్పటివరకు పీఎం కుసుమ్ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 15 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు తొమ్మిది దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. ఈనెల 22వ తేదీ వరకు అవకాశం ఉన్నందున ఈ సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీలకు 90శాతం రుణాలు..

సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఒక మెగావాట్‌కు రూ.2.97 కోట్ల వ్యయం అవుతుందని రెడ్కో అంచనా వేసింది. ఎస్‌హెచ్‌జీలు 10 శాతం వాటా భరిస్తే, మిగిలిన 90 శాతాన్ని బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. అంటే, మెగావాట్ ప్లాంటు ఏర్పాటుకు ఎస్‌హెచ్‌జీలు రూ.29.70 లక్షలు పెట్టుబడి పెడితే, బ్యాంకులు రూ.2.61 కోట్లు రుణంగా ఇవ్వనున్నాయి. ప్లాంట్ల ఏర్పాటుకు ఎస్‌హెచ్‌జీలకు ప్రభుత్వ, అటవీ, దేవాదాయ భూములను ప్రభుత్వం లీజుకు ఇవ్వనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో అత్యుత్తమ పనితీరు కలిగిన సంఘాలను ఎంపిక చేస్తున్నారు. రైతులైతే 30 శాతం పెట్టుబడి పెడితే 70 శాతం మూలధనాన్ని బ్యాంకులు రుణంగా ఇవ్వనున్నాయి. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు 6 శాతం వడ్డీకే రూ.2 కోట్ల వరకు రుణం ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మహిళా సంఘాల ఎంపిక చివరి దశకు

ఉమ్మడి జిల్లాలో 80 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగా.. అధికారులు స్థలాల పరిశీలన, సంఘాల ఎంపిక చేపట్టారు. తొలుత ఖమ్మం జిల్లాలో రెండు, భద్రాద్రి జిల్లాలో రెండు యూనిట్ల ఏర్పాటుకు సంఘాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. మహిళా దినోత్సవమైన మార్చి 8న ప్లాంట్లకు శంకుస్థాపన చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. దీంతో ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, మధిర, కల్లూరు, పెనుబల్లి, రేలకాయలపల్లి ప్రాంతాలను, భద్రాద్రి జిల్లాలో సుజాతనగర్, బైరాగులపాడు (దుమ్ముగూడెం మండలం) ప్రాంతాలను సర్వే చేసి సెర్ప్ అధికారులకు నివేదిక పంపించారు. ఖమ్మం జిల్లాలో రెండు యూనిట్ల ఏర్పాటుకు స్థలాన్ని ఖరారు చేయాల్సి ఉంది.

ఆసక్తి పెరుగుతోంది..



ఉమ్మడి జిల్లాలో సోలార్ విద్యుత్ వినియోగానికి ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇళ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటుకు పలువురు దరఖాస్తు చేస్తున్నారు. రైతులు, డెవలపర్లు, మహిళా సంఘాల వారి నుంచి అప్లికేషన్లు అందాయి. మోడల్ గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తున్నాం. వీలైనన్ని ఎక్కువ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు 63049 03919 నంబర్‌లో సంప్రదించవచ్చు.

– పొలిశెట్టి అజయ్‌కుమార్, డీఎం, టీఎస్ రెడ్‌కో, ఖమ్మం

సొంత భూముల్లో విద్యుదుత్పత్తి..

సొంత భూములు కలిగిన రైతులు, డెవలపర్లు, రైతు సంఘాలు, ఇతర సంస్థలు ఆసక్తి చూపితే వారితో 0.5 మెగావాట్ నుంచి 2 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయించేందుకు చర్యలు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో 100 మెగావాట్లు, భద్రాద్రి జిల్లాలో 100 మెగావాట్ల ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆర్థిక స్తోమత లేకుంటే డెవలపర్లకు తమ భూములను లీజుకు ఇచ్చి ప్లాంటు పెట్టించుకోవచ్చని రైతులకు సూచిస్తున్నారు. ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు నాలుగెకరాల స్థలం అవసరం. ఈ ప్లాంట్లు ఉత్పత్తి చేసి విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు 25 ఏళ్ల పాటు కొనుగోలు చేస్తామని హామీ ఇస్తూ ఒప్పందం చేసుకోనున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) నిర్ణయించిన ధర ప్రకారం యూనిట్ విద్యుత్‌కు రూ.3.13 చొప్పున రైతులు, ఎస్‌హెచ్‌జీలకు డిస్కంలు చెల్లిస్తాయి. ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా ఏటా సగటున 16 లక్షల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్లాంట్లు ఏర్పాటు చేసేవారికి రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు.

పరీక్షలా.. తగ్గేది లేదు..

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- విద్యార్థుల్లో భయం పోగొట్టేలా అవగాహన సదస్సులు
- కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిర్వహణ



ఎన్నెస్పీకాలనీ పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ (ఫైల్)

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి పరీక్షలు అంటే విద్యార్థుల్లో ఆందోళన ఉండటం సహజం. వారి ఆందోళన తొలగించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తుంది. ఈ సారి ఫలితాలంటే ఆషామాషీగా కాకుండా ఉత్తీర్ణత శాతం పెంచాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి పాఠశాలలో 100 శాతం ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల్లో భయం పోగొట్టేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇటు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మార్చి 23 నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు విద్యాశాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. విద్యార్థుల సిలబస్ పూర్తి చేయించడం.. వారితో రివిజన్ చేయించడంపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నారు.

9 వేల మందికి పైగా విద్యార్థులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 282 ఉండగా.. వాటిల్లో 9,833 మంది విద్యార్థులు మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారు. వారు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం గంట, సాయంత్రం ఒక గంట చొప్పున ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ఈ తరగతుల్లో విద్యార్థులను చదివించటంతో పాటు వారికున్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు ప్రతి సబ్జెక్ట్‌పై పట్టువస్తుందని హెచ్‌ఎంలు చెబుతున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుంచి అల్పాహారం అందిస్తోంది. సుమారు రూ.55 లక్షలను అల్పాహారం కింద ప్రభుత్వం వెచ్చిస్తోంది.

శ్రద్ధగా చదువుకుంటున్నాం

పాఠశాలలో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం సమయా ల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతులు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మాకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మా వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో శ్రద్ధగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధిస్తామనే నమ్మకం ఉంది.

–డి.హిందు, నాగులవంచ హైస్కూల్, చింతకాని మండలం

మంచి మార్కులు సాధిస్తాం

పదో తరగతి సిలబస్‌ను జనవరిలోనే ఉపాధ్యాయులు పూర్తి చేశారు. ఆ తర్వాత నుంచి ప్రతి నాలుగు పాఠాలు, ఐదు పాఠాలు మాదిరిగా స్పెషల్ టెస్టులు నిర్వహించారు. స్పెషల్ టెస్ట్‌ల వల్ల పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను ముందుగానే అవగాహన చేసుకుని మంచి మార్కులు పొందేందుకు మార్గం దొరికింది. మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకం ఉంది.

– యువరాజ్, శాంతినగర్ హైస్కూల్, ఖమ్మం

నూరు శాతం ఫలితాలు సాధించేలా..

జిల్లాలో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. విద్యార్థులకు సైతం పరీక్షలపై భయం పోగొట్టేలా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

– సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

మెరుగైన వైద్య సేవలందించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మధిరలో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం



ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర: రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిర పట్టణంలోని కేవీఆర్ జనరల్ ఎమర్జెన్సీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్య శ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా భట్టి విక్రమార్కకు ఆస్పత్రి అధినేత డాక్టర్ కోట రాంబాబు, డాక్టర్ అరుణకుమారి ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల రమణగుప్త, లావణ్య దంపతుల కుమార్తె సాత్విక వివాహ వేడుకకు హాజరైన భట్టి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కాలుష్య సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



కాలనీవాసులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి: సత్తుపల్లి సైలో బంకర్ నుంచి వస్తున్న కాలుష్య సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ వాసులు సింగరేణి సైలో బంకర్ కాలుష్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మంత్రి తుమ్మలను గండుగులపల్లిలో కలిసిన బాధితులు సమస్యను ఆయనకు వివరించారు. సైలో బంకర్ నుంచి విడుదల చేస్తున్న బొగ్గు కాలుష్యంతో కాలనీలోని ప్రజలు ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడుతున్నారని, ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని విన్నవించారు. కాలుష్యం బారి నుంచి తప్పించి పునరావాసం కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సింగరేణి అధికారులతో చర్చిస్తామని, అధికారుల స్పందనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కదారి మదీనా, మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి నాగేశ్వరరావు, పాలకుర్తి ప్రభుదాసు, పాలకుర్తి మణిబాబు, కొత్త సాంబయ్య, కిష్టపాటి కోటిరెడ్డి, వాడపల్లి కోటేశ్వరరావు, కొండ నాగరత్నం, వాడపల్లి నాగమణి, పాలకుర్తి రాణి, వాడపల్లి అరుణ పాల్గొన్నారు.

జొన్నరొట్టె.. కొరివి పచ్చడి!

ప్రేమతో ఏది పెట్టినా పరమాన్నమే అంటున్న మంత్రి పొంగులేటి



జొన్నరొట్టె తింటున్న మంత్రి పొంగులేటి

రఘునాథపాలెం: 'జొన్న రొట్టె.. కొరివి పచ్చడి అంటే నాకు ఎంతో ఇష్టం.. ప్రేమతో ఏది పెట్టినా అది పరమాన్నమే' అన్నారు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. ఆదివారం ఆయన రఘునాథపాలెం మండలం పుటానితండాలో గిరిజన నాయకుడు మూడ్ బాలాజీ కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అందించిన జొన్న రొట్టె తింటూ అక్కడి నాయకులతో కాసేపు మాట్లాడారు. మంత్రి వెంట మూడ్ చిన్న, వాంకుడోత్ దీపక్, బోడ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్యకల్యాణంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భళా.. సప్తకళ!

ఆకట్టుకున్న విన్యాసాలు



కిషన్ జంగ్లర్ విన్యాసం..



స్కేటింగ్‌పై భరతనాట్యం చేస్తున్న బేబీ ఫైర్ ప్రార్థవిక

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సప్తకళ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ.. విభిన్నమైన, సాహసోపేతమైన కళలను ప్రదర్శించటం అభినందనీయమన్నారు. సాధారణ కళా ప్రదర్శనలకు భిన్నంగా కళలను విన్యాసాలకు జోడించి ప్రదర్శించటం ప్రత్యేక ప్రతిభగా అభివర్ణించారు.

భిన్నమైన ప్రదర్శనలు..

ముంబైకి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్ కిషన్ జంగ్లర్ కత్తుల జగ్లింగ్ ప్రదర్శన, చెన్నైకి చెందిన పాల్‌రాజ్ 5 ఫేస్ డ్యాన్స్, మణిక్ చంద్ వేసిన ప్లేట్లు, గ్లాసులపై రాజస్థానీ డ్యాన్స్, ఖమ్మానికి చెందిన బేబి ఫైర్ ప్రార్థవిక స్కేటింగ్‌పై భరతనాట్యం, మంటలతో ఫైర్ రవి, బేబీ పండు విన్యాసాలు, చెన్నైకి చెందిన కళాకారుల అమేజింగ్ డ్యాన్స్, శివనాగులు, కాల్వకట్ట జాన్ ఆలపించిన గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మిత్ర గ్రూప్స్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, తస్మా రాష్ట్ర కార్యదర్శులు ఐ.వి. రమణారావు, నెల నెలా వెన్నెల నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, కాళ్ల పాపారావు, జల్లా లక్ష్మీనారాయణ, బొల్లు సైదులు, టి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీనియర్లు, జూనియర్ల మధ్య ఘర్షణ

సోషల్ వెల్ఫేర్ కాలేజీలో ఘటన

పెనుబల్లి: మండలంలోని కుప్పెనకుంట్ల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో సీనియర్ జూనియర్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవ పోలీస్ స్టేషన్‌కు చేరింది. శనివారం రాత్రి సీనియర్ – జూనియర్ ఇంటర్ విద్యార్థులు టీవీలో సినిమా చూస్తున్న సమయంలో చానల్ మార్చే విషయంలో ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. జూనియర్ విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం హాస్టల్ సిబ్బంది, ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ ఘటనపై బాధిత విద్యార్థి ఫిర్యాదుతో దాడికి పాల్పడిన ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు వీఎం.బంజర పోలీసులు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా..



బోల్తాపడిన వాటర్ ట్యాంకర్

సత్తుపల్లిరూరల్: గ్రీన్‌ఫీల్డ్ హైవే జాతీయ రహదారి పనుల్లో భాగంగా సత్తుపల్లి మండలం కిష్టాపురం తండా సమీపంలో రోడ్డుపై ఉన్న దుమ్ముధూళిపై నీళ్లు చల్లుతున్న వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్రేన్‌తో వాటర్ ట్యాంకర్‌ను తొలగించటంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రూ.1.09 లక్షలు చోరీ



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారం అంబేడ్కర్‌నగర్‌లో ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. పాగా వెంకటేశ్వరరావుకు చెందిన మూడున్నర ఎకరాల భూమికి సొసైటీలో రూ.1,09,500 రుణం రాగా నగదును బీరువాలో పెట్టాడు. శనివారం రాత్రి దొంగలు బీరువాను పగులకొట్టి నగదు ఎత్తుకెళ్లారని సత్తుపల్లి పోలీసులకు వెంకటేశ్వరరావు ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకిన వ్యక్తి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి బ్రిడ్జి పైనుంచి గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి బ్రిడ్జిపై చెప్పులు విడిచి, గోదావరిలో దూకి గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం అందడంతో టౌన్ ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా రాత్రి వరకు వ్యక్తి ఆచూకీ లభించలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం..

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడుదామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని ఉర్దుఘర్‌లో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా మొదటి మహాసభ ఆర్.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా.. నర్సయ్య మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన జరుగుతోందని, కేంద్రం, రాష్ట్ర పరిధిలోని పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు, రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని సూచించారు. అనంతరం మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం మాట్లాడుతూ.. కార్మిక వర్గానికి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చి ఎనిమిది గంటల పనిలేకుండా చేయటం సరికాదని మండిపడ్డారు. సభలో గడిపెల్లి కృష్ణప్రసాద్, గోపాల్‌రావు, పెద్దబోయిన సతీశ్, చంద్రశేఖర్, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య, వేల్పుల రమేశ్, గురునాథం, కోరం శాంతయ్య, జరుపుల సుందర్, మల్సూర్, సిద్ధు, రాజేందర్‌కుమార్, భారతి, వీరన్న తదితరులు పాల్గొన్నారు. తొలుత రైల్వే స్టేషన్ నుంచి ఉర్దూఘర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సభలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,487

కరకట్టకు బ్రిడ్జి బ్రేక్!



జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతం

నిలిచిన గోదావరి కరకట్ట పొడిగింపు నిర్మాణ పనులు

- జాతీయ రహదారిపై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యం
- భారీగా పెరగనున్న నిర్మాణ అంచనా వ్యయం
- ఈ ఏడాది జూన్ నాటికీ పనులు పూర్తి కావడం కష్టమే

భద్రాచలం: భద్రాచలంలో కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కరకట్ట పొడిగింపు పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇరిగేషన్, జాతీయ రహదారుల శాఖల మధ్య సమన్వయ లోపం, డిజైన్ల మార్పుతో పనులు వేగవంతంగా సాగడంలేదు. ఫలితంగా వచ్చే వర్షాకాలంలో కూడా సుభాష్ నగర్, సీఆర్‌పీఎఫ్ క్యాంపు పరిసర ప్రాంతాలాలకు గోదావరి వరద ముప్పు తప్పేలా లేదు.

రూ.38 కోట్లతో కట్ట పొడిగింపు

గోదావరి వరద నుంచి భద్రాచలంలోని ముంపు కాలనీల ప్రజలను రక్షించేందుకు తీరం వెంబడి 2000లో సుమారు 7.5 కిలోమీటర్ల పొడవునా 10 నుంచి 15 మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించారు. కూనవరం రోడ్డులో సరస్వతి శిశు మందిర్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉండటంతో అక్కడ రోడ్డుకు ఇరువైపులా 700 మీటర్ల దూరం కరకట్ట పనులు ఆగిపోయాయి. అనంతరం ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ముందడుగు పడలేదు. మూడేళ్ల నుంచి గోదావరికి భారీ వరదలు రావడంతో కూనవరం రోడ్డు వైపు ఉన్న కాలనీలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. పలుమార్లు విన్నవించాక అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల కోడ్ ముందు 700 మీటర్ల కరకట్ట నిర్మాణానికి రూ. 38 కోట్లు విడుదల చేసింది. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పనులు కొనసాగాయి.

ఎన్‌హెచ్‌పై రోడ్డు బ్రిడ్జి నిర్మాణమే పెద్ద సమస్య?

11 మీటర్ల ఎత్తుతో సాగుతున్న కరకట్ట పొడిగింపు పనులు గత జూన్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలుమార్లు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కానీ విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై సరస్వతి శిశు మందిర్‌వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉండటంతో నెల రోజుల నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పనులను ఇరిగేషన్ శాఖ పర్యవేక్షిస్తుండగా, ఓవర్ బ్రిడ్జి, ఇరువైపులా అప్రోచ్ రోడ్, రిటైనింగ్ వాల్ నిర్మాణాలు పటిష్టగా చేపట్టాలని జాతీయ రహదారుల శాఖ సూచించింది. ఈ క్రమంలో రెండు శాఖల మధ్య డిజైన్ల మార్పులపై సంప్రదింపులు, సర్వేలు సాగుతూనే ఉన్నాయి. ఇటీవల ఎన్‌హెచ్ అధికారులు ప్రాథమికంగా అనుమతి ఇవ్వగా, బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో మట్టి శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ఆ మట్టి సాంద్రత నివేదిక వచ్చాకే బేస్‌మెంట్, కరకట్ట ఎత్తు నిర్ధారించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

వచ్చే వర్షాకాలంలోనూ తప్పని వరద ముప్పు

ఇటీవల కొత్తగూడెం అవతల వేపలగడ్డ గ్రామం వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి తరహాలో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం ఉండాలని జాతీయ రహదారుల శాఖ సూచించినట్లు తెలిసింది. ఆ ప్రకారం అప్రోచ్ రోడ్లు, బ్రిడ్జి, బైపాస్ రోడ్ నిర్మాణాలకు బడ్జెట్ భారీగా పెరిగే అవకాశం ఉంది. కరకట్ట పొడిగింపునకు ప్రభుత్వం కేటాయించిన రూ. 38 కోట్లకు వ్యయం మూడు, నాలుగింతలయ్యే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై ఆడిటింగ్, రాష్ట్ర కమిటీ విజిట్ సర్వేలు, ఇతర పనులు పూర్తయితే తప్ప ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభంకావు. ఈ నేపథ్యంలో రానున్న వర్షాకాలం సీజన్ నాటికీ కరకట్ట పూర్తయ్యే పరిస్థితి కనిపించటం లేదు. దిగువ ప్రాంత కాలనీ వాసులు మళ్లీ గోదావరి వరద ముంపు భయంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా మంత్రులు దృష్టి సారించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని వేడుకుంటున్నారు.

నివేదిక వచ్చాకే...

బ్రిడ్జి నిర్మాణ ప్రాంతంలో మట్టి శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపాం. ఆ రిపోర్టులు అందాల్సి ఉంది. నిర్మాణ డిజైన్, బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచాం. గోదావరి వరదల నుంచి దిగువ ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ ఉండేలా పనులు చేపడతాం. ప్రభుత్వం నుంచి ఇతర అనుమతులు రాగానే పనులు తిరిగి ప్రారంభమవుతాయి.

– రాంప్రసాద్, ఈఈ, ఇరిగేషన్ శాఖ భద్రాచలం

కేసు నమోదు

కామేపల్లి: ఫేక్ ఫేస్‌బుక్ ఖాతా తెరిచి, మహిళల ఫొటోలతో మోసాలకు పాల్పడుతున్న మద్దులపల్లి గ్రామానికి చెందిన గద్దెబోయిన హరీశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ ఫొటోతో ఫేస్‌బుక్ ద్వారా తనను మోసం చేశాడని మద్దులపల్లికి చెందిన హరీశ్ ఫిర్యాదుతో జి.హరీశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికుమార్ వెల్లడించారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు


రఘునాథపాలెం: గిరిజన గురుకుల విద్యాలయాల్లో నీట్ జేఈఈ శిక్షణ కోసం కేటాయించిన కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 2025 – 26 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశానికి స్క్రీనింగ్ (ప్రవేశ) పరీక్ష మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని గిరిజన గురుకుల ప్రతిభ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది. పరీక్షకు 430 మంది విద్యార్థులకు గాను 412 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి తెలిపారు. పరిశీలకులుగా సింగరేణి గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ వ్యవహరించారు.

సమాచార లోపంతో ఇబ్బందులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ సీఓఈ ఇంటర్ ప్రవేశ పరీక్షపై సరైన సమాచారం ఇవ్వక పోవడంతో ఇబ్బందులు పడ్డామని పలువురు అభ్యర్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి కళాశాలతోపాటు ఖమ్మం, దమ్మపేట మహిళా డిగ్రీ కళాశాలలో కూడా సెంటర్ ఏర్పాటు చేసినప్పటికీ హాల్ టికెట్‌లో సరైన చిరునామా ఇవ్వకపోవడంపై తాము సమయానికి కళాశాలకు చేరుకోలేక పోయామని, వచ్చినా ఇది సెంటర్ కాదని తిప్పి పంపించారని, దీంతో పలువురు బాలికలు పరీక్ష రాయకుండానే వెనుదిరిగి పోయారని తెలిపారు. సిబ్బందిని అడిగితే పట్టించుకోక పోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్‌కు వెళ్లామని తల్లిదండ్రులు తెలిపారు. హాల్ టికెట్‌లో ఇచ్చిన ఫోన్ నంబర్ గతంలో ఈ కాలేజీలో పని చేసిన వారిది కావడంతో తమకు సరైన సమాచారం ఇవ్వడంలో తాత్సారం జరిగిందన్నారు. చివరకు బాలికలు పరీక్షకు హాజరయ్యారు. దీనిపై ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రజితను వివరణ కోరగా తమ కళాశాలకు 427 మందిని కేటాయించగా 396 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని, ఎలాంటి ఇబ్బందులు లేవని పేర్కొన్నారు.

అల్లుడిపై పెట్రోలు పోసి నిప్పు..

- 14 రోజులు చికిత్స పొంది మృతి
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



బల్లెం గౌతమ్ (ఫైల్)

టేకులపల్లి: భార్యాపిల్లలను చూసేందుకు అత్తారింటికి వచ్చిన అల్లుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించి, ఇంట్లోకి వెళ్లి తలుపుపెట్టుకున్నారు. మంటలకు తాళలేక ఎంతగా మెత్తుకున్నా వారు తలుపు తీయకపోవడంతో పక్కనే ఉన్న నీటితొట్టిలో దూకాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం దంతెలబోరు ఎస్సీకాలనీకి చెందిన బల్లెం చినవెంకటేశ్వర్లు పెద్ద కుమారుడు బల్లెం గౌతమ్ (23).. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన ఎజ్జు వెంకటేశ్వర్లు కుమార్తె కావ్యను రెండేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. సుజాతనగర్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత నెల కావ్య తన ఇద్దరు పిల్లలతో కలిసి రామచంద్రునిపేటలోని పుట్టింటికి వచ్చింది. ఈ నెల 2న రాత్రి గౌతమ్ తన పిల్లలు, భార్యను చూసేందుకు రామచంద్రునిపేటకు వచ్చాడు. గౌతమ్‌ని లోపలికి వెళ్లనీయకుండా అత్తామామ, బావమరుదులు అడ్డుకున్నారు. దుర్భాషలాడి, దాడి చేయడంతో పాటు గౌతమ్‌పై పెట్రోలు పోసి నిప్పంటించారు. అనంతరం అందరూ లోపలికి వెళ్లి తలుపులు వేసుకున్నారు. మంటల్లో కాలుతూ ఆర్తనాదాలు చేస్తున్నా రక్షించలేదు. పక్కనే ఉన్న నీటితొట్టిలో దూకిన గౌతమ్‌ని చుట్టు పక్కల వారు బయటకు తీసి, కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఖమ్మం, వరంగల్ ఎంజీఎంకు తరలించారు. 14 రోజుల పాటు చికిత్స పొందిన గౌతమ్ ఆదివారం మృతి చెందాడు. బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఈ నెల 2న రామచంద్రునిపేటలో ఘటన జరిగిందని, 11న మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. కాగా, ఈ నెల 2న ఘటన జరిగి, 11న ఫిర్యాదు వచ్చినప్పటికీ ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడంతో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

చింతకానిలో బర్డ్‌ఫ్లూ కలకలం



మృతి చెందిన కోళ్లు

మృత్యువాత పడుతున్న కోళ్లు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు, లచ్చగూడెం గ్రామాల్లో బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోళ్ల ఫారంలోని వందలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న కోళ్ల ఫారంలలో పెంచుతున్న కోళ్లు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి రోజూ సుమారు 700 కోళ్లు మృతి చెందుతున్నాయని ఫారం నిర్వాహకులు ఉమ్మనేని లక్ష్మయ్య, అప్పన రమేశ్, సురేశ్ తెలిపారు. పశుసంవర్ధక శాఖాధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని వాపోయారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. బ్యాంక్‌లో రుణాలు తీసుకుని కోళ్ల ఫారంలను నిర్వహిస్తున్నామని, బర్డ్‌ఫ్లూ వైరస్‌తో ఫారంలోని కోళ్లు చనిపోతుండటంతో లక్షల్లో నష్టం వాటిల్లితుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పశుసంవర్ధకశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించి వైరస్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కజొన్న పంట ధ్వంసం



మొక్కజొన్నను పరిశీలిస్తున్న రైతులు

ముదిగొండ: మండలంలోని వనంవారి కిష్టాపురంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారు. వనంవారి కిష్టాపురానికి చెందిన చాగంటి రంగయ్య రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేశాడు. కొద్దిరోజుల్లో పంట చేతికందే దశలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, మొక్కజొన్న పంట కాళ్లతో తొక్కారని రైతు పేర్కొన్నాడు. రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లిందని, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తానని రైతు రంగయ్య తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని ఏలువారిగూడెం – మేడిదపల్లి గ్రామాల మధ్యలో ఎస్సారెస్పీ కాల్వ కట్టపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన కోల సైదులు (41) మేళం వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న బ్యాండ్ మేళం వాయించే పని ఉందని భార్య ఉషకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. 15న ఉదయం భార్యతో ఫోన్‌లో మాట్లాడగా ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆదివారం ఉదయం మేడిదపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కాలువపై సైదులు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సైదులు భార్య ఉష ఘటనా స్థలానికి చేరుకుని తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కూచిపూడి జగదీశ్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దకు కుమార్తెలున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ జగదీశ్

నిల్వ చేసిన ఇసుక సీజ్



సీజ్ చేసిన ఇసుక

మధిర: మండలంలోని మహదేవపురం గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను ఆదివారం తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు సీజ్ చేశారు. అనుమతి లేని మహదేవపురం ఇసుక రేవు నుంచి కొంతమంది అక్రమంగా ఇసుకను తరలించి నిల్వ చేస్తున్నట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో తహసీల్దార్ రాంబాబు విచారణ నిర్వహించి నిల్వ చేసిన ఇసుకకు బౌండరీ గీసి సీజ్ చేసినట్లు తెలిపారు.

లారీ, బైక్ ఢీ.. ఒకిరికి గాయాలు

కొణిజర్ల: కంటైనర్, ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం మండలంలోని తనికెళ్ల సమీపంలో చోటుచేసుకుంది. చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చర్లపల్లి వెంకటేశ్ ఖమ్మంలో పనిచేస్తున్నాడు. ఆదివారం తన అత్తగారి ఇంటికి (కొణిజర్ల) వచ్చి భోజనం చేసి తిరిగి తన ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్తుండగా తనికెళ్ల చివరన రాజస్తానీ దాబాలోకి వెళ్లేందుకు మళ్లుతున్న కంటైనర్ లారీ వెనక వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం లారీ కింద పడి నుజ్జునుజ్జయింది. వెంకటేశ్‌ను స్థానికులు ఖమ్మం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి...

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. జూలూరుపాడు మండలంలోని పడమటనర్సాపురం గ్రామానికి చెందిన కట్రం నర్సింహారావు, ఇనగంటి మురళి ద్విచక్రవాహనంపై చంద్రుగొండకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. మార్గమధ్యలో గానుగపాడు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది. గాయపడిన మురళిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో బాలికకు...

అశ్వారావుపేటరూరల్: విద్యుదాఘాతంతో ఓ బాలికకు తీవ్ర గాయాలు కాగా, పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి కి చెందిన 13ఏళ్ల కేతా లాస్య ఆదివారం సాయంత్రం బట్టలు ఆరేసేందుకు బిల్డింగ్‌పైకి వెళ్లింది. తడి బట్టలు ఆరేసే క్రమంలో 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురి కాగా, తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబీకులు బాలికను అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా, బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...



రోహన్‌సాయి(ఫైల్)

మధిర: మధిరలోని శాంతి థియేటర్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దాములూరి రోహన్‌సాయి (18) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. ఎనిమిదో వార్డుకు చెందిన రోహన్‌సాయి, గౌస్‌పాషా, అశోక్ బైక్‌పై వెళ్తూ మరో బైక్‌ను ఢీకొట్టి.. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. గాయపడిన వారిని ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో రోహన్‌సాయి మృతిచెందాడు. గౌస్ పాషా ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అశోక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మరోబైక్‌పై వెళ్తున్న శ్రీనివాస్‌కు ప్రాణాపాయం తప్పింది. మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని దంపతుల దుర్మరణం

మృతులు దుమ్ముగూడెం వాసులు

ఎటపాక (అల్లూరిజిల్లా): మండలంలోని నవోదయ పాఠశాల సమీపంలో జామాయిల్ కర్రలోడు ట్రాక్టర్ ఢీకొని దంపతులు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ కన్నపరాజు కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని మారాయిగూడెం పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన సోయం రాంబాబు(45), ముత్యాలమ్మ (40) ద్విచక్రవాహనంపై భద్రాచలం వచ్చారు. పని ముగించుకుని ఎటపాక మండలం బొజ్జిగుప్ప గ్రామం మీదుగా స్వగ్రామానికి వస్తున్నారు. జామాయిల్ కర్రలోడుతో ట్రాక్టర్ భద్రాచలం వస్తోంది. సింగిల్‌రోడ్డు కావడంతో వారు నవోదయ పాఠశాల సమీపంలో ట్రాక్టర్‌ను దాటి వెళ్లేక్రమంలో కర్ర ద్విచక్రవాహనానికి తగలడంతో దంపతులు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.